క్లుప్తంగా

పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్రం


కార్మికులతో వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు వైవీ రమణ

కర్నూలు (టౌన్) : పెట్టుబడిదారులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తుందని వైఎస్ఆర్‌టీయూసీ అధ్యక్షుడు వైవీ రమణ అన్నారు. సోమవారం 157 వ మే డేను పురస్కరించుకొని స్థానిక వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ కార్యాలయం వద్ద జెండా పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలను ప్రైవేటీకరిస్తూ కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు మున్సిపల్ కార్మికులతో కలిసి నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజను కలిసి వినతిపత్రం అందజేశారు.

కార్మిక చట్టాలను ఉపయోగించుకోవాలి

కర్నూలు (లీగల్): కార్మిక చట్టాలను కార్మికులు ఉపయోగించుకోవాలని లోక్ అదాలత్ జడ్జి నాగశ్రీనివాసరావు అన్నారు. సోమవారం కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చాంబర్ ఆఫ్ కామర్స్, మున్సిఫ్ కోర్టు దగ్గర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ జడ్జి మాట్లాడుతూ వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో కార్మిక శాఖ, సంబంధిత శాఖలు, ఆటో, హమాలీ, బిల్డింగ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జి.పుల్లయ్యలో ఘనంగా టెక్ ఎక్స్‌ఫ్లోర్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్

కర్నూలు సిటీ: స్థానిక జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో టెక్నికల్ ఫెస్ట్‌లో భాగంగా సోమవారం 'టెక్‌ఎక్స్‌ప్లోర్' కార్యక్రమానికి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆ కాలేజీ చైర్మన్ జి.వి.ఎం మోహన్ కుమార్ అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలు ఇటువంటి కార్యక్రమాల ద్వారా మరింత మెరుగు పడుతాయన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలన్నారు. అనంతరం కాలేజీ స్పెషల్ ఆఫీసర్ డా.వై. పాండురంగయ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఆ తరువాత కాలేజీ ప్రిన్సిపల్ డా.కె ఇ శ్రీనివాస రావు మాట్లాడుతూ టెక్‌ఎక్స్‌ప్లోర్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ ఆచార్య శశికుమార్, ఆచార్య బి.సునీత, అడ్మినిస్ట్రేటివ్ డీన్ డా.గిరిధర్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దింపాలి

కర్నూలు(రాజ్‌విహార్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర నేత రామచంద్రయ్య అన్నారు. సోమవారం రాత్రి వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ అంబేడ్కర్ భవన్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందన్నారు. కార్మికులు, రైతాంగాన్ని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ ప్రభుత్వానికి గట్టిగా సమాధానం చెప్పి ఇంటికి పంపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి సిద్ధం కండి



కర్నూలు కల్చరల్: కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. సోమవారం 137వ ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని దేవీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేయడం దుర్మార్గం అన్నారు. అంతకు ముందు సీక్యాంప్ నుంచి దేవి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు మాట్లాడారు.ఐప్టీయూసీ నగర అధ్యక్షుడు బి.వెంకటేష్, సీపీఐ నగర కార్యదర్శి చంద్రశేఖర్, నగర డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

వినోదం..వికాసం

- సెలవుల్లో వివిధ అంశాల్లో ప్రత్యేక శిక్షణ శిబిరాలు
- నైపుణ్యాల పదునుకు సరైన సమయం
- పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు
- చిన్నారుల ఆసక్తి, అభిరుచే ప్రధానంగా ప్రవేశాలు


కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులు

కర్నూలు కల్చరల్: పాఠశాల విద్యార్థులకు పరీక్షలు ముగిశాయి. వేసవి సెలవులు కూడా ఇచ్చారు. ఇప్పటి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టిన బాలబాలికలు సెలవుల్లో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు మానసిక ఉల్లాసంతో పాటు వారి అభిరుచులకు తగిన విధంగా సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, యోగా, ధ్యానం, క్రీడాలు తదితర అంశాల్లో శిక్షణ ఇప్పించేందుకు మక్కువ చూపుతున్నారు. వీరి ఆసక్తికి తగ్గట్టు జిల్లాలో వేసవి శిక్షణ శిబిరాలు మొదలయ్యాయి. కొందరు ఉచితంగా నిర్వహిస్తుండగా, మరికొందరు నామమాత్రపు ఫీజులతో నడుపుతున్నారు.

జిల్లాలో శిక్షణ శిబిరాల హడావుడి

వేసవి కాలం వచ్చిందంటే చాలు జిల్లా వ్యాప్తంగా వేసవి శిక్షణ శిబిరాల హడావిడి మొదలవుతుంది. సెలవుల్లో నెల రోజుల పాటు విద్యార్థులకు వివిధ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. సమయం సద్వినియోగంతో పాటు చిన్నారుల్లో విజ్ఞాన వినోదాంశాలు పెంపొందిస్తారు. తల్లిదండ్రులు సైతం చిన్నారుల అభిరుచికి తగినట్లు సమ్మర్ క్యాంప్‌లను ఎంపిక చేసి అందులో చేరుస్తారు. ప్రస్తుతం కర్నూలు, నంద్యాల, ఆదోని, డోన్‌తో పాటు జిల్లాలోని అన్ని నియోజక వర్గ కేంద్రాల్లో వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నారు. సుమారు 270 సంస్థలు వివిధ అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నాయి. నెల రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరాలు చిన్నారుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తున్నాయి.

గమనించాల్సిన అంశాలు

- చిన్నారులకు ఇష్టమైన అంశాల్లో శిక్షణ ఇప్పించాలి. ఇలా చేయడం ద్వారా అందులో వారు రాణించేందుకు వీలవుతుంది.
- వయసు, వారివారి తరగతులను బట్టి అందుకు తగిన అంశాల్లో శిక్షణ ఇప్పించాలి.
- పిల్లలను బలవంతం చేయకుండా సరదాగా కేంద్రాలకు వెళ్లేలా చూడాలి. విజ్ఞానంతో పాటు వినోదం పెరుగుతుందని బాల బాలికలకు సూచించాలి.
- ప్రస్తుతం ఎండలు చాలా తీవ్రంగా ఉండటంతో ఎక్కువగా ఇండోర్ సంబంధిత అంశాల్లో తర్ఫీదు ఉత్తమం.
- సెలవుల్లోనూ చదవాలని పిల్లలపై ఒత్తిడి చేయరాదు. అలా చేయడం ద్వారా వారు మానసికంగా బలహీనులవుతారు
- ఇదివరకే ఏదైనా అంశంలో ప్రవేశం ఉన్న విద్యార్థులు శిక్షణ శిబిరానికి వెళ్లడంతో వారిలో నైపుణ్యం పెరుగుతుంది.

వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరాల వివరాలు

చిన్మయ మిషన్

వేదిక : కర్నూలు వీఆర్ కాలనీ చిన్మయ మిషన్ కేంద్రం.
శిక్షణ తేదీలు : మే 1 నుంచి 8వ తేదీ వరకు.
నేర్పించే అంశాలు: నైతిక విలువలు, భగవద్గీత, యోగ– ధ్యానం, జ్ఞాపక శక్తిని పెంపొందిపజేసే మంత్రాలు, ఆధ్యాత్మికత, సామాజిక పరమైన స్థాయిల్లో అభివృద్ధికి పెంపొందింప జేసే స్తోత్రాలు, ఆటలు, నృత్యాలు, డ్రామా, స్కిట్‌లు, భజనలు, విష్ణు సహస్రనామాలు
సెల్: 98485 63096, 93479 26476

టీజీవీ కళాక్షేత్రం

వేదిక: సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రం
శిక్షణ తేదీలు: మే 1 నుంచి మే 30వ తేదీ వరకు
అంశాలు: శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, ఆధునిక నృత్యం, చిత్రలేఖనం, సంగీతం
ఫోన్ నెంబర్లు: 77804 75080

ఆదోని కళా భారత్

వేదిక: ఎంఐజీ కాలనీలోని గర్ల్స్ హైస్కూల్
శిక్షణ తేదీలు: మే 1 నుంచి మే 30వ తేదీ వరకు
అంశాలు: కరాటే, యోగా, శాస్త్రీయ, ఆధునిక నృత్యాలు, సంగీతం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్
సెల్ : 99660 11773

సత్యసాయి సేవా సమితి

వేదిక: నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరం
శిక్షణ తేదీలు: ఏప్రిల్ 30 నుంచి మే9వ తేదీ వరకు
అంశాలు: రోజువారీ జీవితంలో ఉపయోగ పడే శ్లోకాలు, ప్రార్థనలు, పిల్లల్లో మానవతా విలువలు పెంపొందించడానికి అవసరమైన కథలు, భారతీయ సంస్కృతికి సంబంధించిన ప్రాథమిక వివరణ, పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పెంపొందించే అంశాలు, శారీరక వికాసానికి అవసరమైన ఆటలు, ధ్యానం, యోగ
సెల్: 70133 92139, 99080 77277

ఇస్కాన్

వేదిక: భగరీథ కాంప్లెక్‌లలోని ఇస్కాన్ జగన్నాథ మందిరం
శిక్షణ తేదీలు: మే 1 నుంచి 21వ తేదీ వరకు
అంశాలు : చిత్రలేఖనం, చిత్రాలకు రంగులు అద్దడం, కథలు చెప్పటం, భగవద్గీత శ్లోకాలు, విలువల విద్య, మృదంగం కరతాళ విద్య, అన్నమాచార్య కీర్తనలు, నమస్కార శ్లోకాలు, కళల విద్య.
సెల్: 95053 77520, 9981 47723

ఎస్ఈఎస్

వేదిక: సహస్ర ఇంగ్లిష్ స్కూల్, కప్పల్‌నగర్
శిక్షణ తేదీలు: మే 1 నుంచి జూన్ 6వ తేదీ వరకు
అంశాలు: కూచిపూడి, జానపద నృత్యం, హిప్ హోప్, బాలీవుడ్ స్టైల్, జుంబా, అబాకస్, వేదిక్ మ్యాథ్స్, చిత్రలేఖనం, స్కేటింగ్, పెయింటింగ్, కరాటే, మార్షల్ ఆర్ట్స్
సెల్: 99122 27102, 96662 84139

నంద్యాల కళారాధన

వేదిక: నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్
శిక్షణ తేదీలు: మే 1 నుంచి 30వ తేదీ వరకు
అంశాలు: శాస్త్రీయ, ఆధునిక సంగీతం, నృత్యం, వాయిద్యం, పెయింటింగ్, పేపర్ డిజైన్ కటింగ్, యోగా, వస్త్రాలపై పెయింటింగ్,హిప్నాటిజం, మిమిక్రీ, చిత్రలేఖనం తదితర 20 అంశాల్లో శిక్షణ
సెల్: 98667 03750

వ్యక్తిత్వ వికాసానికి దోహదం



వేసవి శిక్షణ శిబిరాలు బాలబాలికల్లో వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయి.అందుకే మేము ప్రతి సంవత్సరం వేసవి శిబిరం నిర్వహిస్తున్నాం. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఆడుతూ పాడుతూ వివిధ అంశాలను నేర్చుకుంటారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు భగవద్గీతలోని ధ్యాన శ్లోకాలు, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు దైవాసుర సంపత్ విభాగంలోని శ్లోకాలు నేర్పిస్తాం.

– స్వామిని సుప్రేమానంద, కోఆర్డినేటర్, చిన్మయమిషన్

నైపుణ్యాలు పెరిగేలా..



గత 21 సంవత్సరాలుగా కళారాధన సంస్థ ఆధ్వర్యంలో కళాసాధన పేరుతో 20 అంశాల్లో శిక్షణ ఇచ్చి చిన్నారులు నైపుణ్యం సాధించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఒక్కొక్కరు నాలుగైదు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. నెల రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణలో నృత్యం, చిత్రలేఖనానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. శిక్షణ అనంతరం నేర్చుకున్న అంశాలను ప్రదర్శించడానికి వేదిక ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ రవికృష్ణ, కళారాధన సంస్థ, నంద్యాల

సృజనాత్మకత పెరుగుతోంది



వేసవి శిబిరాలకు చిన్నారులు హాజరు కావటంతో చాలా ప్రయోజనాలు కలుగుతాయి. కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటారు. నేర్చుకుంటారు. పరిచయాలు పెరుగుతాయి. సృజనాత్మకత పెరుగుతుంది. సెలవులు వృథా కాకుండా ఆడుతూ పాడుతూ క్యాంప్‌లలో పాల్గొనడంతో సమయం సద్వినియోగమవుతుంది. తెలియని విషయాలు తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తులో వారి ఉన్నతికి దోహదపడుతాయి.

– డాక్టర్ స్రవంతి, ఎస్ఈఎస్ అధినేత

అర్జీలకు పరిష్కారం చూపాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు కల్చరల్: స్పందన అర్జీలకు మొక్కుబడిగా కాకుండా నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి స్పందన అర్జీల పరిష్కారం, హౌసింగ్ అంశాలపై జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీదారుడు అడిగిన విషయాన్ని స్పష్టంగా చెప్పకపోవడంతో రీఓపెన్ అవుతున్నాయని, ప్రారంభంలోనే వాటికి సరైన పరిష్కారం చూపించి క్లోజ్ చేయాలన్నారు. గత నాలుగు నెలలుగా రీఓపెన్ అయిన ప్రతి ఒక్క అర్జీని, దానికి ఇచ్చిన ఎండార్స్‌మెంట్‌ను మంగళవారం జిల్లా సమీక్షా కమిటీ అనంతరం అధికారులు తనిఖీ చేయాలన్నారు. అలాగే రెవెన్యూ సమస్యలను తహసీల్దార్లు బాధ్యతగా డిస్పోజ్ చేయాలన్నారు. ఇకపై ప్రతి సోమవారం ఫిర్యాదుల పరిష్కారాన్ని తాను చెక్ చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. స్టేజ్ కన్వర్షన్‌లో వెనుకబడి, ఒక లక్ష రూపాయల కంటే తక్కువ ఖర్చు చేసిన గూడూరు, చిప్పగిరి, సి.బెళగల్, కోడుమూరు, నందవరం హౌసింగ్ ఏఈలు, డీఈలపై చర్యలు ఎందుకు తీసుకోకూడదు అని హౌసింగ్ పీడీ వెంకటనారాయణ ప్రశ్నించారు. వెంటనే వారికి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య, జెడ్పీ సీఈవో నారసరెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

కర్నూలు (టౌన్): నగర ప్రజలు వివిధ సమస్యలపై అందజేసే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపుతున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొని వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్పందనలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఎస్ ఈ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, ఎంహెచ్ఓ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

3న మంచినీటి సరఫరా బంద్

కర్నూలు(టౌన్): ఈనెల 3 న నగరపాలక సంస్థ పరిధిలోని వెంకటరమణ కాలనీలో 500 ఎంఎం పైపులైన్‌కు ఇంటర్ కనెక్షన్ పనులు చేపడుతున్నందున పలు కాలనీలకు మంచినీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలాజీనగర్, బంజారా కాలనీ, మమతానగర్, పోస్టల్ కాలనీ, కొండారెడ్డి నగర్, అంబేడ్కర్ నగర్, సోనియా గాంధీనగర్, వెంకటరమణ కాలనీ, లేబర్ కాలనీ, శ్రీకృష్ణా కాలనీ, కప్పల్ నగర్, నిర్మల్ నగర్, వాసవీనగర్, ఉమామహేశ్వర్ నగర్, ముజఫర్ నగర్, పోలీసు కాలనీ, రాఘవేంద్రనగర్, షరీఫ్ నగర్, ఉద్యోగ్ నగర్, అబ్బాస్‌నగర్, క్రిష్ణనగర్ (వార్డులు 26,27,29,30, 31, 32, 34, 35,36,39,40,44, 45) లలో నీటి సరఫరా ఉండదని తెలిపారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు కల్చరల్: గ్రామ పంచాయతీల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐయూటీయూసీ అనుబంధ సంస్థ అయిన ఏపీ యూనైటెడ్ గ్రామ పంచాయతీ శానిటరీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి నాగన్న మాట్లాడుతూ మేడేను పురస్కరించుకొని కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆందోళన చేపట్టామన్నారు. అంతకు ముందు రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎమ్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తేజోవతి, నాయకులు బాబు, విశ్వనాథ్, చక్రి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


గడపగడపకు మన ప్రభుత్వంలో మహిళ సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 41వ వార్డు 108వ వార్డు సచివాలయం పరిధిలోని వీకర్‌సెక్షన్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ శ్వేతారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ క్యాలెండర్లు పంపిణీ చేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పథకాలను, ప్రభుత్వ సమాచారాన్ని సకాలంలో అందిస్తున్నా, లేదా అని ఆరా తీశారు. గత ప్రభుత్వంలో ఏదైనా పథకం రావాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులతో పాటు నాయకుల అండదండలు కావాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కరోనా మహమ్మారి ప్రభావంతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్నా పేదల అభ్యున్నతి కోసం పథకాలను కొనసాగించారన్నారు.

కార్మికుల సంక్షేమమే ముఖ్యం

కార్మికుల సంక్షేమమే ముఖ్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. సోమవారం కార్మికుల దినోత్సవం సందర్భంగా హనుమాన్ కాటా సమీపంలోని వైఎస్సార్‌టీయూ, రక్షణ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక జెండా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమ కోసం ప్రభుత్వం వాహనమిత్ర పథకం కింద ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాసులు, డి.లక్ష్మీకాంతరెడ్డి, పి.శారద, కల్లూరు జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, సాగర్, రాజు, భాస్కర్‌రెడ్డి, మాబుసా, రమణారెడ్డి, ఎల్లయ్య, గంగులు, మాధవస్వామి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

స్పోర్ట్స్

ముగిసిన రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో విజేతలుగా నెల్లూరు (బాలురు), అనంతపురం (బాలికలు), కర్నూలు (బాలురు) జట్లు నిలిచాయి. నగర శివారులోని స్థానిక ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న 8వ రాష్ట్ర స్థాయి రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో తూర్పు గోదావరి జట్టుపై 10–5 గోల్స్‌తో నెల్లూరు జట్టు, బాలికల విభాగంలో ప్రకాశం జట్టుపై 5–2 గోల్స్‌తో అనంతపురం జట్టు విజేతలుగా నిలిచాయి. మూడవ స్థానం కోసం జరిగిన పోటీల్లో కృష్ణా జిల్లా జట్టుపై 10–6 గోల్స్ చేసి కర్నూలు జట్టు విజయం సాధించింది. ఆదర్శ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి బొల్లవరం రామాంజనేయులు పాల్గొని విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ శిబిరం ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో వేసవి కరాటే శిక్షణ శిబిరం ప్రారంభించినట్లు కరాటే కోచ్ కోలా ప్రతాప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు ఉంటుందని బాల బాలికలు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9398269016 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్

మందుబాబులకు జైలు శిక్ష

కర్నూలు: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కర్నూలు శివారులోని సుంకేసుల రోడ్డులో సంజీవని హాస్పిటల్ వద్ద ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. కర్నూలుకు చెందిన కురువ రామకృష్ణ, టి.యుగంధర్, పి.మాబాషా, ఎ.నాగరాజు, సుధీర్ బాబు, శ్రీకాంత్, రవి, సురేంద్ర, హుసేనయ్య, శివకుమార్, కార్తీక్ గౌడ్, నాగరాజు, మద్దిలేటి, సర్వేష్ తదితరులు మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. సోమవారం వారిని ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చగా రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. దీంతో వారిని పంచలింగాల దగ్గర జిల్లా జైలులో అప్పగించారు.

తల్లి నిరాకరించిందని...

కర్నూలు: కర్నూలు నగరం కొత్తపేటలో కూతురు దగ్గర ఉంటున్న తల్లి తన ఇంటికి రావడానికి నిరాకరించినందుకు శ్రీరామ్‌నగర్‌లో నివాసముంటున్న షేక్ అఫ్రోజ్ ఖాన్ (57) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గత నెల 29వ తేదీన కొత్తపేటకు వెళ్లి తల్లిని తన ఇంటికి రమ్మని పిలువగా ఆమె నిరాకరించింది. అక్కడే పురుగుల మందు తాగి సొమ్మసిల్లి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి వైద్యచికిత్సలు చేయించగా కోలుకోలేక సోమవారం ఉదయం మృతిచెందాడు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈరోజు

మల్టీ టాస్కింగ్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రెనింగ్ పరీక్షలు మంగళవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు మొదటి విడత, జూన్ 13 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కండక్ట్ ఆఫ్ మల్టీ టాస్కింగ్, హవల్దార్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు ప్రతి రోజు మూడు విడతల్లో ఉదయం 9 నుంచి 10.30 గంటలు, మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు, 3.30 నుంచి 5 గంటల వరకు మూడు షిఫ్ట్‌ల్లో జరగనున్నాయి.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం స్థానిక తన కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు, ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని తన నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నాణ్యతతో పూర్తి చేయాలని చెప్పారు. ఎక్కడైనా నిలిచిపోయిన పనుల వివరాలు చెబితే అందుకు తగిన కారణాలు తెలుసుకుని, ఆసమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. కార్పొరేటర్లు స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. వార్డు సమస్యలను ఎప్పటికప్పుడు మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయించాలన్నారు. మున్సిపల్, వార్డు సిబ్బంది సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ రమాదేవి, ఈఈ షాకీర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అందంగా కొండా రెడ్డి బురుజు ప్రాంతం

కర్నూలు (టౌన్) : నగరంలో రూ. కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అందులో భాగంగా కొండారెడ్డి బురుజు ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నట్లు కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. కొండారెడ్డి బురుజు వద్ద రూ.2 కోట్లు వెచ్చించి చేపడుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. జరుగుతున్న అభివృద్ధి పనులను కాంట్రాక్టర్ నరసింహాను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండేళ్లలో నగరంలో పెద్ద ఎత్తున్న అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అలాగే పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజుకు ఎంతో చరిత్ర ఉందని, తెలుగుదేశం హయాంలో అభివృద్ధిని విస్మరించడమే కాకుండా పట్టించుకున్న పాపానా పోలేదన్నారు. ఇక్కడ నగరవాసులు సేద తీరేలా పార్కును అభివృద్ధి చేస్తున్నామన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కర్నూలు ఎమ్మెల్యే

కర్నూలు కల్చరల్:జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజనను సోమవారం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వంగా కలిశారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సృజనకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలు నగర సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు.

కార్మికుల పక్షపాతి సీఎం జగన్


మేడేను పురస్కరించుకుని కేక్ కట్‌చేస్తున్న మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): కార్మిక పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మే డే సందర్భంగా స్థానిక క్యాంప్ సెంటర్ వద్ద వేడుక నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి కార్మికులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రమ జీవుల పక్షాన నిలిచిన ఏకైక పార్టీ వైఎస్ఆర్‌సీపీ అన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌టీయూసీ నాయకులు కిషన్, కటారి సురేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు మిఠాయిలు పంచిన మేయర్

కర్నూలు (టౌన్): కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో నగర మేయర్ బీవై రామయ్య పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మే డే వేడుకలు నిర్వహించారు. కార్మికులకు మిఠాయిలు పంచి పెట్టారు. కార్పొరేటర్ మునెమ్మ పాల్గొన్నారు.

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కొత్త బస్టాండ్‌లో మే డే వేడుకలు నిర్వహించారు. ఆ సంఘం రీజినల్ కార్యదర్శి ఏవీ రెడ్డి జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమం ఆ సంఘం నాయకులు మహేశ్వరరావు, ఆర్ఎంవీ రావు, ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

- సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడేలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ దేశాయ్ , సివిల్ సప్లైరాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, నాయకులు అబ్దుల్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.
- కర్నూలు వేర్ హౌస్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో మేడేను పురస్కరించుకొని కార్మికులకు ఆటల పోటీలు నిర్వహించారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు నరసింహులు, హమాలీ సంఘం కార్యదర్శి ఓబులేష్, కోశాధికారి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.
- కార్మిక చట్టాలను, హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎం.సుధాకర్‌బాబు విమర్శించారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్‌జిల్లా అధ్యక్షుడు బరారన్న తదితరులు పాల్గొన్నారు.